


# రమణ భాస్కర



ఆధ్యాత్మిక పక్షపత్రిక

5-11-2002 (4)



దీపావళి శుభాకాంక్షలతో..

## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమగోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 06-11-2002 | బుధవారం | జువ్వలపాలెం |
| 14 నుండి 22-11-2002 | | అరుణాచలం క్యాంపు<br>దీపోత్సవం 20-11-2002 బుధవారం |
| 24-11-2002 | ఆదివారం | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణమండపం |
| 28-11-2002 | గురువారం | ప్రాతళ్ళమెరక, కె.వి.కె.రాజు విద్యానికేతన్ |
| 3, 4-12-2002 | మంగళ, బుధ | మురమళ్ళ, వీరేశ్వరస్వామి వారి దేవస్థానం |
| 08-12-2002 | ఆదివారం | నర్సాపురం సాయిబాబా గుడి వద్ద, పార్క్‌రోడ్ |
| 21-12-2002 | శనివారం | శ్రీ రమణ జయంతి, జిన్నూరు శ్రీరమణ క్షేత్రం |

### శ్రీ లక్ష్మిసిల్క్‌హౌస్, భీమవరం ప్రధమ వార్షికోత్సవ సభలో సద్గురు శ్రీ నాన్నగారు





మనస్సును పరిశీలన చేస్తే మనోవృత్తులు వాటంతటవే అణగుతాయి, మనస్సు మూలాన్ని అన్వేషణ చెయ్యడం మరొక పద్ధతి. మనోమూలమే భగవంతుడు, ఆత్మ, లేక చైతన్యం అని పిలువబడుతుంది

- భగవాన్ శ్రీరమణ మహర్షి

ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 4 పుష్పం : 8-10 5-11-2002

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 20

VOL : 8 ISSUE : 04

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 21260

## కార్యము కారణము కంటే వేరు కాదు

బంగారముతో తయారు చేయబడిన అభరణముల యొక్క తయారీకి పూర్వము, ఆభరణముల యొక్క నామ, రూపముల నాశనానంతరము, ఆ మధ్యకాలమున బంగారమే సత్యమై ఆధారమై ఉన్నట్లు, మూల-తలంపు (మనస్సు) ఉదయించక మునుపు అనగా దేహంతో తాదాత్మ్యము చెందక మునుపు, ఆత్మయే ఆధారము. గాఢ నిద్రలో మనస్సు దాని మూలములో లయమైన పిదప ఆత్మయే ఆధారముగా గలదు. ఆ మధ్య కాలమునందు సర్వమునకు అధిష్టానమై, సర్వమునకు స్వరూపమై

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు
11-10-2002 శృంగవృక్షం ........ 3
15-10-2002 జిన్నూరు ........ 10
25-10-2002 భీమవరం ........ 16

Visit us @ www.srinannagaru.com

ఆత్మయే కలదు. ఇట్లు మూడు కాలముల యందును, మూడు అవస్థల యందునూ, ఆధారముగా నుండుటచేత ఆత్మయే సత్యమైనది. ఆధారమైన ఆత్మను విడిచి రూపముగాని, నామముగాని లేదు. సకల నామ, రూపములకు అధిష్టానము బ్రహ్మము. బంగారము నుండి అభరణములను వేరు చేయుట ఎట్లు సాధ్యము కాదో, అట్లే 'ఆత్మ' నుండి దృశ్య ప్రపంచమును వేరు చేయలేము. బంగారమునందు కల్పితమైన నామ, రూపాలు మిధ్యయై బంగారమే సత్యమై నిలిచినట్లు, ఆత్మయందు కల్పించబడిన నామ, రూపాలు మిధ్యయై ఆత్మయే సత్యమై నిలుచుచున్నది. బంగారము ఆభరణము కాదు, కాని ఆభరణము బంగారము కంటే వేరు కాదు. కార్యమైన దేదియును, కారణముకంటే భిన్నముగా నుండదు. ఇక్కడ ఆత్మ కారణము, జగత్తు కార్యము. చీకటిలో పాముగా గోచరించు త్రాడు విచారింపగా త్రాడే అగుచున్నది. ఇట్లే అజ్ఞానము వలన బ్రహ్మము జగత్తుగా గోచరించుచున్నది. అధిష్టానదృష్టితో విచారింపగా, ఈ జగత్తు బ్రహ్మమే యగుచున్నది.

ఆత్మ కారణము, జగత్తు కార్యము

త్రాడు కారణము, కల్పిత సర్పము కార్యము

బంగారము కారణము, ఆభరణములు కార్యము

మట్టి కారణము, కుండలు కార్యము

- చావలి సూర్యనారాయణ మూర్తి, అమలాపురం.

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-10-2002, శృంగవృక్షం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది ఒక్కటే వస్తువు. దానినే బ్రహ్మం అని, భగవంతుడు అని, ఆత్మ అని, చైతన్యం అని పిలుస్తారు. నీకు, నాకు ఈ సృష్టికంతకు ఆధారంగా ఉన్న వస్తువు ఒక్కటే. ఆ ఉన్న వస్తువుతో బ్రహ్మంతో మనం ఒకటి అవ్వాలి అదే మానవుడి జీవితలక్ష్యం. దేహప్రారబ్ధమును బట్టి వచ్చేదీ ఏదో వస్తుంది. రానిది ఏదో రాదు. ఈ సృష్టిలో దేని గురించి దు:ఖపడవద్దు. సంఘటనలు మీకు అనుకూలంగా ఉన్నట్లు అనిపించినా, వ్యతిరేకంగా ఉన్నట్లు అనిపించినా ప్రపంచంలో ఏ సంఘటన గురించి దు:ఖపడవద్దు. దు:ఖపడటానికి తగిన విషయం ఈ లోకంలో ఏదీ లేదు. ప్రారబ్ధంలో ఏది ఉంటే అది వస్తుంది. మీరు కోరుకుంటే ఎక్కువ రాదు, కోరిక లేకపోతే తక్కువరాదు. ఈ విశాలమైన సృష్టిలో భగవంతుడు మీదేహానికి ఏది కేటాయిస్తే అది వస్తుంది. కోరుకొంటే గాని రాదు అని మనం అనుకొంటాము. కోరుకొంటే ఎక్కువరాదు, దానివలన మనస్సు పాడవుతుంది. ప్రతీదీ ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతుంది. ఆయన ఆజ్ఞ లేకుండా ఈ సృష్టిలో ఏదీ జరుగదు. సాధకులకు అతినిద్ర పనికిరాదు, అతిభోజనం పనికిరాదు, అతిసంభాషణ పనికిరాదు, అతిస్నేహం పనికిరాదు. సాధకులు అందరూ ఈ మాటలు దృష్టిలో పెట్టుకోవాలి. ఉన్నది బ్రహ్మమే, అందులో నీవు ఐక్యం అవ్వాలి. దేహమునేను అనే భావన తీసివేస్తే గాని నీవు బ్రహ్మంలో ఐక్యం అవ్వలేవు, బ్రహ్మంతో ఒకటిగా ఉండలేవు. అన్ని అనర్థాలకు దేహము నేను అనే భావనే కారణం. ఈ రోజు ఉదయం ఒక డాక్టరుగారు ఫోన్ చేసి నాన్నగారు నాకు ఏమీ వద్దు, నాకు మోక్షం కావాలి అని అంటున్నారు. మీరు చెప్పే విషయం హృదయంలో నుండి వస్తూ ఉంటే, మీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు కదా, మీకు నిజంగా ఏమీ అక్కరలేదు అన్న విషయం భగవంతుడికి తెలుస్తూఉంటే మీ కోరికతో సంబంధంలేకుండా మీకు మోక్షం ఇస్తాడు అని చెప్పాను.

సాధ్యమైనంత వరకు మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా, పవిత్రంగా, శాంతిగా, ఏకాగ్రంగా పెట్టుకోండి. మనస్సు శాంతిగా ఉంటే మనం చేసేపని బాగా చేయగలము, ప్రకృతి మనకు సహకరిస్తుంది కొంతమంది ఎప్పుడూ విసుగుగా ఉంటారు, విసుగు ఉన్నవాడికి జ్ఞానం రాదు. గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నీ హృదయంలో నేను ఉన్నాను అని నీకు తెలియకపోయినా, నీ మనస్సు నీకు తెలుస్తోందికదా. తెలుసున్న మనస్సును బాగుచేసుకొంటే తెలియని నేను నీకు వ్యక్తమవుతాను అని చెప్పాడు. మనస్సు అందరికి తెలుస్తోంది కదా. తెలిసినదానిని బాగుచేసుకొంటే తెలియనివస్తువు మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనస్సుతో భగవంతుడిని తెలుసుకోలేము, మనస్సు అణిగినచోట భగవంతుడు స్వరూపంగా మనకు వ్యక్తమవుతాడు. భగవంతుని యందు మనకు

నిజమైనభక్తి లేదు, అదే పెద్దలోపం. భక్తి ఉంది అని మనం నోటితో చెప్పినా మనకు లోపల ఎంతవరకు అర్హత ఉందో, పక్వత ఉందో భగవంతుడు చూస్తాడు. మనం ఇంకా పచ్చిగానే ఉన్నాము. ఈశ్వరుని కరుణకు ఇంకా పాత్రులం కాలేదు. అభ్యాసం చేయమని భగవంతుడు చెపుతున్నాడు. జప, ధ్యానములే అభ్యాసం. అభ్యాసం వలన, వైరాగ్యం వలన మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. బ్రహ్మంలో ఐక్యం అవ్వటమే మన జీవిత గమ్యం. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా గమ్యాన్ని మర్చిపోకూడదు, మనం ఏదైతే పొందాలో ఆ గమ్యాన్ని మనం మిస్ అవ్వకూడదు. ఉన్న వస్తువును మనవారు విష్ణువుగా, శివుడుగా, దేవిగా ఆరాధిస్తారు. బ్రహ్మంను చేరటానికి ఇవి మూడు ద్వారాలు. మనం ఏదో ద్వారం గుండా బ్రహ్మంలో ఐక్యం అవ్వవచ్చు. పరబ్రహ్మంలో ఐక్యంఅవ్వటానికి ఆచార్యుడు కూడా ఒకద్వారం. ఆచార్యుడికి శాస్త్ర పాండిత్యంతోపాటు అనుభవం కూడా ఉండాలి. వాడే ఆచార్యుడు. మనం ఏ ద్వారం గుండా ప్రవేశించినా పొందే వస్తువు ఒక్కటే.

రామకృష్ణుడు భగవంతుడుని కాళీరూపంలో ఆరాధించాడు, త్యాగరాజు రాముని రూపంలో ఆరాధించాడు, మీరాభాయి కృష్ణుని రూపంలో ఆరాధించింది కాని వీరు అందరూ పొందేది ఒక్కటే. దేవిని సరస్వతిగా, లక్ష్మిగా, దుర్గగా ఆరాధిస్తారు. సరస్వతి అనుగ్రహం వలన వివేకం కలుగుతుంది, జ్ఞాపకశక్తి కలుగుతుంది. లక్ష్మి అంటే కేవలం డబ్బు కాదు, సంకల్ప శక్తి. ధృడమైన సంకల్పమే లక్ష్మి. గాంధీగారికి అటువంటి ధృడమైన సంకల్పం ఉండేది. ఏదైనా మంచిపని చేయాలని సంకల్పించుకొన్నప్పుడు ప్రాణం ఇవ్వటానికి కూడా ఆయన సిద్ధంగా ఉండేవారు. బద్ధకం, సోమరితనం, దురలవాట్లు, దురాచారములు ఉన్నచోట్ల లక్ష్మి ఉండదు. దుర్గ అంటే క్రియాశక్తి మనం ఏదైతే సంకల్పించుకొన్నామో దానిని కార్యరూపంలో పెట్టాలి అదే దుర్గ. ఈ ముగ్గురు అంటే సరస్వతి, లక్ష్మి, దుర్గ మనకు అవసరమే. ఇప్పుడు దేవీ నవరాత్రులు జరుగుతున్నాయి. ఈ తొమ్మిది రోజులు మనం సాధన చెయ్యాలి. మనలో చెడుఅలవాట్లు ఏమి ఉన్నాయి, బ్రహ్మానుభవం పొందటానికి ఏమి అడ్డువస్తున్నాయి అని చూసుకోవాలి. మనలో చెడు అలవాట్లు, దుర్గుణాలు ఏమి ఉన్నాయో చూసుకొని వాటిలో నుండి విడుదల చేయమని ఈ తొమ్మిది రోజులు ఉపాసన చేయాలి. ఒక మనిషి మనకు ఉపకారం చేయవచ్చు, ఒక మనిషి అపకారం చేయవచ్చు. ఉపకారం జ్ఞాపకం పెట్టుకొంటే కృతజ్ఞత వస్తుంది. అపకారం జ్ఞాపకం పెట్టుకొంటే కోపం, ద్వేషం వస్తాయి. మనం పతనమవుతాము. అందువలన ఈ దేవీ నవరాత్రులు టైములో ఏమిచేయాలిఅంటే ఎవరైనా అపకారం చేస్తే అది మర్చిపోవటానికి, ఉపకారం చేస్తే అది జ్ఞాపకం పెట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనలో ఒక చిన్న బలహీనత ఉన్నా పునర్జన్మ వచ్చేస్తుంది. అందువలన మనలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకొని వాటిలోనుండి విడుదల చేయమని దేవిని ప్రార్థించాలి. ఇలా తొమ్మిది రోజులు సాధనచేస్తే, ఉపాసనచేస్తే

విజయదశమి రోజున మనకు విజయం కలుగుతుంది, మనం కొత్తవారము అయిపోతాము. మనకు ఉమ్మివస్తే రోడ్డు ప్రక్కన గాని, ఇంటి దగ్గర అయితే సింఖ్‌లలో గాని వేస్తాము. ప్రభుపాద ఏమిచెప్పాడు అంటే మీకు చెడుతలంపులు వస్తూ ఉంటే మీకు వచ్చే ఉమ్ములను ఆ చెడుతలంపుల మీద వేయండి అని చెప్పాడు. పుణ్యబలం లేని వాడికి మంచి మాటలు వినాలని ఉండదు, మంచి మాటలను మననం చేయాలని ఉండదు, మంచిని ఆచరించాలని ఉండదు. పూర్వజన్మలలో సత్కర్మ చేసి ఉండకపోతే మంచి మాటలు శ్రవణం చేయాలనే తలంపుకూడా రాదు. కొంతమంది 100 సంవత్సరాలు బ్రతుకుతారు అసలు జ్ఞానం పొందాలనే తలంపు కూడా లేకుండా శరీరం విడిచిపెట్టిపోతారు. ఆ జన్మలు వృధా. మనస్సు ఎప్పుడూ విషయాలను చింతిస్తూ ఉంటుంది, అలా విషయాలను చింతిస్తూ ఉంటే బంధంలో పడతావు, అదే మనస్సు ఆత్మను చింతిస్తే మోక్షం కలుగుతుంది. గాలివాన వచ్చినప్పుడు సముద్రంలో ఉన్నపడవ పరిస్థితి ఎలా ఉంటుందో విషయాలను చింతించే జీవుడి పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. గీతకృష్ణుడు చెప్పాడు అని మనం అనుకొంటున్నాము కాదు ఆత్మ చెప్పింది, కృష్ణుడు ఆత్మఅయి చెప్పాడు. ఆత్మను ఎలా పొందాలో ఆత్మే చెప్పింది. మనకు స్థిరచిత్తంలేదు. భగవంతుడు ఉన్నాడా లేడా అని ఏ గంటకు ఆగంట అనుమానించే వాడికి ఇంక భగవంతుడి మీద మనస్సు ఏమి నిలబడుతుంది. మనం ఏదైనా పనిచేయాలి అనుకొంటున్నాము అనుకోండి. ప్రశాంతంగా కూర్చొని ఆపని చేయటం మంచిదా, మంచిదికాదా ఆపని చేయటం వలన మనకు ఉపకారము ఉందా, సమాజానికి ఏమైనా ఉపకారం ఉందా అని ఆలోచిస్తే అది చెడ్డపని అనుకోండి దాని వలన నీకు చేటు, సమాజానికి చేటు అని నీ హృదయం చెపుతుంది. కాని హృదయం చెప్పింది మన వాసన విననివ్వదు. ఇది మీరు గ్రహించాలి. అందువలన పూర్తిగా వాసనాక్షయం అయితే గాని మోక్షం రాదు. రమణభాషణలలో కూకటివేరు అని వస్తోంది అది ఏమిటి అని అడుగుతున్నారు. కూకటివేరు అంటే దేహము నేను అనే భావనే కూకటి వేరు. నీవు ఆత్మవు కాని దేహాన్నేఆత్మ అనుకొంటున్నావు, అదే కూకటి వేరు.

లౌరి అనే భక్తుడు, అమెరికా దేశస్థుడు రెండు నెలల నుండి ఆశ్రమంలో ఉంటున్నారు. తిరిగి అమెరికా వెళ్ళిపోతూ భగవాన్‌తో మీసన్నిధిని విడిచిపెట్టి వెళ్ళటం కష్టంగా ఉంది. నేను అమెరికా వెళ్ళవలె. సద్గురు సందేశాన్ని అర్థిస్తున్నాను. నేను మీకు దూరంగా ఉన్న రోజులలో నేను మననం చేసుకోవటానికి, నేను ఆచరించటానికి నాలుగు మంచి మాటలు చెప్పండి అని లౌరి అడుగుతున్నాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీవు గురువును విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాను అంటున్నావు, గురువును విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళిపోతావు. అంతా ఉన్నదే ఆత్మ, చైతన్యం. ఆ చైతన్యమే గురువు. ఆయన నీలోపలే ఉన్నాడు. లోపల ఉన్న గురువుతో అనుబంధం పెట్టుకో. ఇక సందేశం అంటావా నీ లోపల ఉన్నవాడు నిరంతరం

చెబుతూనే ఉంటాడు. వినేబుద్ధి, వినేవివేకం నీకు ఉంటే నేను చెప్పటం ఏమిటి? నీ లోపల ఉన్నవాడు చెపుతూనే ఉంటాడు. నీవు ఒకవేళ వినకపోయినా ఆయన నిన్ను వదలడు. అదే దేవుని దయ. నీవు విన్నా, వినకపోయినా ఆయన చెపుతూనే ఉంటాడు. వినటానికి మీకు విసుగు రావాలి కాని చెప్పటానికి ఆయనకు విసుగులేదు. వాడు దేవుడు. భగవంతునికి ఎందుకు విసుగు రావటంలేదో చెప్పండి? ఆయనలో పాపంలేదు. ఏరకమైన దోషం, ఏరకమైన బలహీనత లేనివాడు ఒక్క భగవంతుడు మాత్రమే. అద్దం మురికిగా ఉంటే నీ మొఖం సరిగా కనబడదు. అలాగే నీ మనస్సు మురికిగా ఉంటే హృదయంలో భగవంతుడు ఉన్నా ఆయన నీకు వ్యక్తం కాడు. నీవు గురువును విడిచిపెట్టి వెళ్ళి పోతున్నాను అంటున్నావు. నీవు ఆత్మను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళిపోతావు. ఆత్మ అంతటా ఉంది. నీవు అమెరికా వెళితే అక్కడ ఆత్మ లేదా. నీవు ఆత్మను విడిచిపెట్టి ఎక్కడికివెళ్ళలేవు. నీదేహం ఒకచోటనుండి ఇంకో చోటకు కదులుతోంది. నీ దేహం ఎక్కడికి వెళ్ళినా ఆత్మఉంది. ఆత్మకు నీవు దూరంగా ఉండలేవు. ఎందుచేతనంటే అది అంతటా ఉంది, అది చెపుతూనే ఉంటుంది. అది చెప్పిన మాటలను నీ మనస్సు విననివ్వదు, నీలోపల ఉన్న పాపం విననివ్వదు. నీ దేహం నీ కూడా వస్తోంది. నీ గురువు నీ కూడా రాకుండా ఉంటాడా. నీ గురువు నీలోపలే ఉన్నాడు. నీ మనస్సును లోపలకు త్రిప్పు. గురువే ఆత్మ, గురువే బ్రహ్మం, అది తప్పించి ఈ లోకంలో ఏమీలేదు, నీ బేధబుద్ధివలన ఏదో ఉన్నట్లు నీకు అనిపిస్తోంది. జీవితంలో అన్నీ తలంపులే. తలంపులు లేనిది సద్వస్తువు ఒక్కటే. అదే నీకు గురువు, వాడే నీ హృదయంలో ఉన్నాడు. వాడు చెప్పినది విను, సరిపోతుంది. కాని వాడు చెప్పినది వాసనలు విననివ్వవు. వాసనల యొక్క వేగం, కోరికల యొక్క వేగం ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతున్నావు గాని లోపల భగవంతుడు ఉన్నాడు, ఆయన చెపుతున్నాడు అని నీ మొఖం అటుత్రిప్పవు. కారణం లేకుండా కోపం వస్తూ ఉంటే ప్రతీదానికి ప్రతిస్పందన వస్తూ ఉంటే, కారణం లేకుండా ఉద్రేకం వస్తూ ఉంటే లోపల పాపం ఎక్కువ ఉంది అని అర్ధం. అది మనకు తెలియటం లేదు.

నేను అనే తలంపులేని స్థితిని పొందటమే నాలుగు వేదముల యొక్క సారం. నా దేహం, నా దేహం అని ఎప్పుడూ ఆ శవాన్ని వేసుకొని దాని చుట్టూ తిరుగుతావు, దానిని ఎవరిని మాట అననివ్వవు. మరి గాఢనిద్రలో నీకు దేహం గొడవలేదుకదా, అప్పుడు మీరు సుఖంగా, శాంతిగా ఉన్నారు కదా ఇంక ఎందుకు ఈ దేహాన్ని వేసుకొని, నిరంతరం దాని గొడవలో ఉంటున్నారు. మొసలిని నమ్మినదిని దాటుదామనుకోవటం ఎటువంటిదో నిరంతరం దేహం గొడవలో ఉండి మోక్షం పొందుదామనుకోవటం అటువంటిదే. నీ జీవితంలో జరిగే సంఘటనలు అవి భగవంతుడికి తెలియకుండా జరగటం లేదు, భగవంతుడికి తెలిసే జరుగుతున్నాయి. నీ మొఖాన్నిఆయనవైపుకు త్రిప్పటానికే ఆ

సంఘటనలు జరుగుతున్నాయి. ఎవరిమీద అయినా మీకు బాగా ఇష్టం ఉంది అనుకోండి, వారు మిమ్మల్ని అగౌరవపరచారు అనుకోండి, వారి మీద మీకు మమకారం పోతుంది. అది కూడా భగవంతుడి లీలలో భాగమే. భగవతుడికి తెలియకుండా మన శరీరం చనిపోదు. ఎక్కడికి తీసుకొని వెళ్లటానికి ఈ శరీరం నుండి సెపరేట్ చేస్తున్నాడో. భగవంతుడి సంకల్పం అద్భుతమైనది. భగవంతుడి లీల అద్భుతమైనది, అపూర్వమైనది అని నీ గుండెకు తాకితే ఇంక నీకు చావు అంటే భయం కూడా పోతుంది.

నీవు ఏ పని చేసినా కృష్ణార్పణం అంటూ చెయ్యి, వ్యక్తిభావనతో చెయ్యవద్దు. అలా చేస్తూ ఉంటే మనస్సు నశిస్తుంది. నీవు ఏదిచేసినా చేసే శక్తి ఎవడు ఇచ్చాడు, భగవంతుడే ఇచ్చాడు. శక్తి భగవంతుడిదే, అది మీది అనుకొంటే అహంకారం పెరుగుతుంది, శక్తి భగవంతుడిదే అనుకొంటే అజ్ఞానం పోతుంది, జ్ఞానం కలుగుతుంది. నాకు ఇష్టమైన పనిని చెయ్యి, నిరంతరం నన్ను స్మరించుకో, నిష్కామకర్మ చేస్తూ ఉండు అలా చేస్తూ ఉంటే నీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే ఆత్మజ్ఞానం కలుగుతుందో, ఈశ్వరానుభవం కలుగుతుందో అటువంటి సద్బుద్ధిని నీకు ఇస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. నాపట్ల భక్తి కలిగి ఉండు, నీకు బుద్ధి సూక్ష్మతను ఇస్తాను. అప్పుడు నీకు పరాభక్తి కలుగుతుంది. పరాభక్తి వలననే పరతత్వం నీకు తెలుస్తుంది. మనం సాధారణ భక్తులం. ఇంకా పరాభక్తి మనకు రాలేదు. మనకు అన్నీ కావాలి, దేవుడూ కావాలి అది సామాన్యభక్తి, దేవుడే కావాలి, ఇంకేమీ అక్కరలేదు అనేది పరాభక్తి. లౌరి భగవాన్‌కు నమస్కరించి నాకు సత్యాన్వేషణ చేసే బుద్ధిని ప్రసాదించండి అని అడిగాడు. మనకు సత్యాన్వేషణ చేసే బుద్ధి లేదు, అది లేదు అన్న సంగతి కూడా మనకు తెలియటంలేదు. సత్యాన్వేషణ చేసే బుద్ధి లేదు అని ఆయనకు తెలుస్తోంది కాబట్టి అది ప్రసాదించమని అడుగుతున్నాడు. మనకు భక్తి ఉంది గాని సత్యాన్వేషణ చేసేబుద్ధి లేదు. అక్కడ పసుపు వచ్చింది, ఇక్కడ కుంకుమ వచ్చింది, వారికి కోరికలు నెరవేరిపోయాయి అని అటు ఇటు పరుగులు పెట్టటం. ఇది సామాన్య భక్తి, కోరికలతో కూడిన భక్తి, సకామభక్తి కాని నిష్కామభక్తి కాదు. నిష్కామ భక్తి ఉన్నవాడికే సత్యాన్వేషణబుద్ధి కలుగుతుంది. ఆ దేవుడిని ఎలా జపించాలి, ఈ దేవుడిని ఎలా పూజించాలి అనే గొడవే తప్ప లోపలనుండి నేను, నేను అని వ్యక్తమయ్యేవాడు ఎవడు అని వాడిని ప్రశ్నించేవాడు ఒక్కడు కూడా కనబడటం లేదు. అందరికీ అసహజాలే కావాలి గాని సహజం ఎవరికి అక్కరలేదు. ఆ దేవుడు కాదు అని ఈ దేవుడు, ఆ దేవత కాదు అని ఈదేవత ఇలా సంతలో పడి తిరగటమే మన పని. ఇలా సంతలో ఈ శవాన్ని త్రిప్పుతున్నవాడు ఎవడు అని ప్రశించే బుద్ధిమంతుడు ఒక్కడు కూడా కనబడటం లేదు. ఈ గొడవలు అన్నీ కల్పించే దొంగనేను ఎవడు అని విచారణ చేసేవాడు ఒక్కడూ లేడు. మీకు దేవుడిని చూడాలని ఉంది. అంటే చూడాలనుకొనేవాడు ఒకడు ఉన్నాడు కదా. ఆ చూడాలనే వాడు ఎవడు?

ఎప్పుడైనా వాడి గురించి కొంచమైనా విచారణ చేసారా? నీవు సాధన చేస్తున్నావు అందులో దొంగనేనును కలుపుతున్నారా? నీవు ఏదైతే పోగొట్టుకోవాలో దానిని నీసాధనలో కలపాలి కదా, లేకపోతే వాడు ఎలా పోతాడు. దేహగతమైన నేనును విడిచిపెట్టి సాధన చేస్తే అది ఎలా పోతుంది. నీ పూజలో, జపంలో, ధ్యానంలో దానిని కలపాలి.

సాధన లేకుండా సిద్ధికలుగదు, నీవు ఆత్మసిద్ధిని పొందు, నీవు పొందవలసింది ఏదో పొందు. తరువాత నీ దేహంద్వారా ఏది జరగవలసిఉందో అది సహజంగా జరిగిపోతుంది. దేవుడు ఎక్కడో ఉన్నాడు, నేను ఎక్కడో ఉన్నాను అంటే అది సరియైన స్థితి కాదు. దేవుడు నీకు స్వరూపంగా వ్యక్తమవ్వాలి. దేవుడు నీకు దూరంగా ఉన్నాడు అని అనిపిస్తూ ఉంటే ఆయనను మీ జీవితంలో భాగం చేసుకోండి. కొంతమంది యజమానులు ఎలా ఉంటారు అంటే ఇంటికి అన్నీ తెచ్చి పడేస్తారు కాని అందరూ తన మాటవినాలి, తను చెప్పినట్లు చేయాలి, తన మాటే నెగ్గాలి అంటారు. ఆ కుటుంబ సభ్యులు ఏమంటున్నారు అంటే ఏదో భోజనం పెడుతున్నాడు అని అంతా ఆయన చెప్పినట్లే నడవాలి అంటే ఎలా? మాకు స్వేచ్ఛ ఉండాలి కదా అంటున్నారు. రాజాజీ ఒక మాట చెప్పాడు కృష్ణుడు నేను ఆయుధం పట్టను అని దుర్యోధనుడితో చెప్పాడు, అప్పుడు భీష్ముడు ఏమన్నాడు అంటే నీ చేత ఆయుధం పట్టిస్తాను కృష్ణా అన్నాడు. అంటే ఇక్కడ భగవంతుడు ఒక మాట చెప్పాడు, భక్తుడు ఒక మాట చెప్పాడు. కాని నా మాట ఓడిపోవాలి, భక్తుడి మాటే నెగ్గాలి అని ఆ సమయంలోనే మనస్సులో భగవంతుడు అనుకొన్నాడు అని రాజాజీ చెప్పాడు. కృష్ణుడు ఆడిన మాట తప్పాడు అన్నా ఫరవాలేదు గాని భీష్ముడు గౌరవం నిలబడాలి. కాని మనం అయితే మనమాటే నెగ్గాలి అనుకొంటాము.

మూలతలంపు యొక్క మూలాన్ని తెలుసుకోవటమే నిజమైన విద్య. నీవు నిర్మలంగా నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండి మనం నిరంతం నేను నేను అని వాడుతున్నాము, ఈ నేను ఎక్కడ నుండి వస్తోంది? అని విచారణ ఎప్పుడైనా చేస్తున్నావా. నీ హృదయంలో సహజంగా ఉన్న వస్తువును వదలి వేస్తున్నావు. దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు. నీ మనస్సు నిర్మలం కాకుండా, నిశ్చలం కాకుండా, ఏకాగ్రం కాకుండా నీలోపల ఉన్న బ్రహ్మపదార్థం నీకు తెలియదు. నీవు సాధన చేసి మనస్సును లోపలకు పంపటం నేర్చుకో. దేహము అనేది ఒక వేషం. ఆ వేషం తీసివేస్తే భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పుడు దేహం చనిపోయినా నేను ఉంటాను అన్న సంగతి నీకు తెలుస్తూ ఉంటుంది. ఇదే మరణానుభవం ద్వారా అమృతానుభవం పొందినవాడు వెంకటరమణుడు. తన దేహం పోయింది, దానిని కాల్చేస్తారు కాని నేను ఉన్నాను. ఉండటం అనే దానికి ఈ దేహానికి ఎట్టి సంబంధం కనబడటం లేదు. ఈ దేహం పోయినా నేను ఉంటాను అనే అనుభవం ఆయనకు కలిగింది. ఒకోసారి జీవితాన్ని ఏదో సంఘటన సడన్‌గా మలుపుత్రిప్పేస్తుంది,

ఏదో కెరటం వస్తుంది అటు గెంటేస్తుంది. ప్రభుపాదకు భాగవతం అంటే చాలా ఇష్టం. ఆయన భార్యకు టీ అంటే ఇష్టం. ఒకసారి టీపొడి కొనటానికి ఇంట్లో డబ్బులు కనబడకపోతే భాగవతం అమ్మేసి టీపొడి కొంటుంది. మామూలుగా భార్య తిట్టిన తిట్లు ప్రభుపాద భరించేవాడు కాని తనకు అభిమానగ్రంథం అయిన భాగవతంను టీపొడి కోసం అమ్మేసరికి ఆ సంఘటనకు ఆయనకు వైరాగ్యం వచ్చింది. సన్యాసం పుచ్చుకొన్నాడు. భాగవతం అమ్మటం అనే కెరటం ఆయనను సన్యాసంలోనికి గెంటేసింది. భగవాన్‌తో అన్నగారు అంటారు నీవు యోగిలాగ కనబడుతున్నావు నీబోటివారికి ఇంటి దగ్గర పని ఏముంది? ఎక్కడికైనా పోరాదా అంటారు. ఆ పరిస్థితిలో మనం ఉంటే మనకు కోపం వస్తుంది. కాని భగవాన్‌కు కోపం రాలేదు, ఎందుచేతరాలేదు? అక్కడ పాపం నశించింది. కోపం రావటానికి అక్కడ ఏమీ లేదు. పైగా అన్నగారు చెప్పింది యదార్ధం, ఎక్కడికైనా పోవటం మంచిది, ఎక్కడికి పోవాలి అంటే అరుణాచలం, అరుణాచలం. అది చెప్పింది ఎవరు అంటే హృదయంలో ఉన్నగురువే చెపుతున్నాడు. అంతే బయలు దేరాడు, అతి వేగంగా అరుణాచలం వచ్చిపడ్డాడు. ఆది జన్మాంతర అనుబంధం. మీలో అయినా సరే జన్మాంతర అనుబంధం ఉంటే ఆ స్నేహాలు చనిపోయేవరకు ఉంటాయి, జన్మాంతర అనుబంధం లేకపోతే అమావాస్య రోజున స్నేహం, పౌర్ణమిరోజున బ్రేక్. భగవంతుడు జీవితాలను ఎప్పుడు ఎలా మలుపు తిప్పుతాడో చెప్పలేము. ఈశ్వరుడు అనేవాడు ఉన్నాడు అని, యజమాని ఉన్నాడని, మనకంటే అతీతమైన శక్తి ఒకటి ఉంది అని ముందు అంగీకరించండి, తరువాత సాధన చేయవచ్చు. ఆయనను అంగీకరించ కుండా మేము ఏదో గంతులు వేస్తున్నాము, ముక్కులో గాలి చూసుకొంటున్నాము అంటే కుదరదు.

లారి ఏమని చెపుతున్నాడు అంటే మీ మాటలు వింటూ ఉంటే నా చేతిలో ఎన్నో బహుమానాలు పెట్టినట్లుగా ఉంది అన్నాడు. భగవాన్ ఏమన్నారు అంటే బహుమానాన్ని ఇచ్చేవాడు ఎవడు? పుచ్చుకొనేవాడు ఎవడు? అని చిరునవ్వు నవ్వారు. ఈ బహుమానాలు ఇవ్వటాలు పుచ్చుకోవటాలు ఇవి అన్నీ ద్వైత్వానికి సంబంధించిన మాటలు, వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టు. ఇవి అన్నీ దేహగతాలు, మనోగతాలు. లారి, ఇవి అన్నీ స్వప్నంతో సమానము కాని మనం వెళ్ళవలసింది హృదయంలోనికి. నీహృదయంలో ఉన్న ఈశ్వరుడే నీకు గతి, ఆయనే నీ పతి, నీవు పొందవలసింది కూడా ఆయననే. ఆయనను విశ్వసిస్తే ఆయన నీ పట్ల దయచూపిస్తాడు. ఆయన దయవలన నీవు జననమరణ చక్రం నుండి విడుదల పొందుతావు. అందువలన నీ హృదయంలో ఉన్నసత్యంవైపుకు నీ సాధనను గురిపెట్టు లారీ అన్నారు భగవాన్. అప్పుడు లారీ భగవాన్‌కు నమస్కరించి వెళ్ళిపోతూ మధ్యమధ్యలో వెనుకకు తిరిగి గురువు యొక్క మొఖాన్ని చూస్తూ ఆ మొఖంలో ఉన్న శాంతిని ఆనందాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-10-02, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మీరు దేహాన్ని కాదు ధ్యానం చేయవలసింది, మీరు ఆత్మను ధ్యానం చేయాలి, ఏదో రోజులు బాగా వెళ్ళిపోవాలి, సుఖంగా ఉండాలి అని ధ్యానం చేస్తే భగవంతుడు అదే ఫలితాన్ని ఇస్తాడు. తాత్కాలిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకోవద్దు, మోక్షాన్ని గమ్యంగా పెట్టుకోవాలి. మనం దేనిని ధ్యానం చేస్తున్నామో మన హృదయంలో ఉన్న సర్వసాక్షి చూస్తూ ఉంటాడు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టేయండి. ఒకోసారి అదృష్టంరావచ్చు, ఒకోసారి దురదృష్టంరావచ్చు. ప్రారబ్దాన్ని బట్టి దేహం నడిచిపోతుంది. సాధనలో ముఖ్యమైన రహస్యం ఏమిటి అంటే ప్రారబ్ధాన్ని మనం మార్చుకోలేక పోవచ్చు, మన మనస్సును మనం మార్చుకోవచ్చు. సాధనలో ఇదీ ముఖ్యమైన భాగం. ప్రారబ్దం ఎలా ఉన్నా మన మనస్సును నిగ్రహించుకొంటే, నియమించుకొంటే మనకు మోక్షం వస్తుంది. ఇది గుర్తు పెట్టుకోండి. మనకు దేహభావన ఎక్కువగా ఉంది, ఆత్మభావన తక్కువగా ఉంది. దేహము, లోకము, చావులు, పుట్టుకలు, విరోధాలు, స్నేహాలు ఇవి అన్నీ కల్పితాలే. కల్పితం కానిది బ్రహ్మంఒక్కటే, పరబ్రహ్మం ఒక్కటే. మిగిలినవి అన్నీ మనస్సు కల్పించిన విషయాలే. మీలో ఏదైనా దోషం ఉంది అనుకోండి, మీలో ఉన్న దోషం నాకు మోక్షం రాకుండా అడ్డురాదు. మీలో ఉన్న దోషాన్ని చూస్తున్న నాలో ఉన్న దోషం నాకు మోక్షం రాకుండా అడ్డువస్తుంది. జాగ్రత్తగా అర్థం చేసుకోండి, సబ్జక్టు బాగా అర్థమయితే మీకు ఈ జన్మలోనే మోక్షం వస్తుంది. విషయం బాగా అర్థమవ్వటానికి బుద్ధి సూక్ష్మత అవసరం. మతం పేరు మీద మూఢనమ్మకాలు, మూఢాచారాలు పెంచటం కాదు. మతాల యొక్కసారం, వేదాల యొక్క సారం ఆత్మజ్ఞాన సముపార్జన. మీకు ఉన్న తెలివిని, వివేకాన్ని చంపటం మతం యొక్క లక్ష్యం కాదు, మతం మీ వివేకాన్ని పెంచాలి. దేహమునేను అనే మొదటి తలంపే అహంకారం. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో, ఏ తలంపుకయితే ఇతరతలంపులు వస్తున్నాయో, ఆ తొలితలంపే అహంకారం, దానినే జీవుడు అంటారు.

మానవుడు దివ్యుడు అని అంటున్నారు అయితే శోఖాలు, తాపాలు ఎందుకు వస్తున్నాయి అని అడుగుతున్నారు. మానవుడు ఆత్మస్వరూపుడు కదా మరి దు:ఖం ఎందుకు వస్తోంది అని ప్రశ్న. వాడు ఆత్మే కాని దానికి సంబంధించిన అనుభవం వాడికి లేదు. దాని తాలూక అనుభవం ఎప్పుడైతే లేదో ప్రకృతిగుణాలు, జీవలక్షణాలువచ్చి వాడిని మూసేస్తాయి. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు, మానవుడిలో ఉన్న రాగద్వేషములే సంసారం. ఎంతకాలం అయితే రాగద్వేషములు ఉన్నాయో అంతకాలం పునర్జన్మలు వస్తాయి.

రాగద్వేషములనుండి విడుదల పొందినవాడు సంసారంలో నుండి బయటపడతాడు గాని ఇంట్లో నుండి పారిపోయినవాడు సంసారంలో నుండి బయటపడలేడు. ఎవడైతే రాగద్వేషములను సమూలంగా విడిచిపెట్టగలిగాడో వాడే సంసారచక్రం నుండి విడుదల పొందుతాడు. మనకు తెలిసినా, తెలియకపోయినా మనం ఆత్మస్వరూపులమే. అది తెలిస్తే ప్రకృతిగుణాలు మన జోలికి రావు, తెలియకపోతే ప్రకృతిగుణాలు మనలను మూసేస్తాయి. నీకు వచ్చే కోపాలు, తాపాలు అన్నీ కూడా ప్రకృతిలక్షణాలే, జీవలక్షణాలే. నీ నిజస్వరూపం నీకు తెలిస్తే పులి దగ్గరకు మేకలు ఏ విధంగా అయితే రావో అలాగ ప్రకృతిగుణాలు అసలు నీ దగ్గరకు రావు. నీవు ఎవడో నీకు తెలియనంతకాలం ప్రకృతిగుణాలు నిన్ను విడిచిపెట్టవు. నీ హృదయంలో బ్రహ్మం ఉంది. దాని స్వరూపం సత్ చిత్ ఆనందం. అది ఎప్పుడూ ఉంటుంది, జ్ఞానంగా ఉంటుంది, శాంతిగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది. అదే బ్రహ్మం.

దేహం కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది,మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది అని గీతలో భగవంతుడు చెపుతూ అనేక మంచి విషయములు చెప్పాడు, అయినా మనకు వినటానికి చెవులు లేవు, చూడటానికి కళ్ళులేవు. చెవులు ఉండి చెవిటివాళ్ళం అయిపోయాము, కళ్ళు ఉండి గుడ్డివాళ్ళం అయిపోయాము. ఎవడు బుద్ధిమంతుడు అంటే తన శరరాన్ని, ఇంద్రియాలను, మనస్సును ఎవడైతే జాగ్రత్తగా ఉపయోగించుకొంటున్నాడో, జాగ్రత్తగా నియమించుకొంటున్నాడో వాడే బుద్ధిమంతుడు. మనస్సు, మాట, దేహము ఒకటిగా ఉండాలి అని వేదం చెప్పింది. ఈ మూడు ఒకటిగా ఉన్నవాడికి పరమాత్మ సాక్షాత్కారం కలుగుతుంది, వాడు దివ్యుడు అవుతాడు. ఈ మూడు ఒకటిగా ఉంటే నరుడు నారాయణుడు అవుతాడు. కొంతమంది మనస్సుతోటి ఒకటి ఆలోచిస్తారు, నోటితో ఒకటి చెపుతారు, చేత్తో ఒకటి చేస్తారు, ఒకదాని కొకటి పొంతనే ఉండదు. ఇలాంటి వారికి దైవానుగ్రహం రాదు. నువ్వు ఏదైతే ఆలోచిస్తున్నావో, అదే నోటితో చెప్పు. నోటితో చెప్పిందే చేతితో చెయ్యి, ఇలా మూడూ ఒకటిగా ఉన్నవాడు జ్ఞానం పొందటానికి సమర్థుడు అవుతాడు, యోగ్యుడు అవుతాడు అనివేదమాత చెప్పింది. ఈ దేహం నువ్వు కాకపోయినా, ఈ దేహమే నీవు అని మూలతలంపు చెపుతోంది. ఆ మూలతలంపును విచారణ చేయటం మానివేసి, అది కల్పించిన గొడవలతో అజ్ఞానం అనే అడవిలో పడి తిరుగుతున్నావు. ఈదేవుడు కాదని ఆదేవుడు, ఈమార్గం కాదని ఆమార్గం, ఈయాత్ర కాదని ఆయాత్ర ఇలా ఎన్నో కల్పించుకొని ఆ అడవిలో తిరుగుతున్నావు. మీకు నేను అనే తలంపు లోపల నుండి వ్యక్తమవుతోంది కదా. దానిని కొంచమైనా విచారణ చేయటం లేదు. నీకు ప్రత్యక్షంగా కనిపించే ఈ విషయాన్ని వదిలేసి, కల్పించిన గొడవలు పట్టుకొంటున్నావు. మూలతలంపు మూలంలోనికి

వెళ్ళటం మీద సాధనను గురిపెట్టటం లేదు. మూలతలంపును మినహాయించి ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు, పామును విడిచిపెట్టి పుట్టమీద దెబ్బలు కొట్టినట్లుగా ఉంటుంది. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎఱుకలోనికి వచ్చేవరకు నీవు తాపంలో నుండి, పాపంలోనుండి విడుదల పొందలేవు. వాక్కును సద్వినియోగం చేస్తే సరస్వతీదేవి అనుగ్రహం ఉంటుంది, వాక్కుకు అధిష్టానదేవత సరస్వతిదేవి. అందువలన వాక్కును జాగ్రత్తగా నియమించుకోవాలి. లేగదూడను ఒక పెద్దతాడుతో గట్టిగా పట్టుకొని లాగితే అది నీకూడా ఎలాగ వచ్చేస్తుందో అలాగ జన్మాంతరం నుండి వచ్చిన వాసనలు నీ మనస్సును ప్రకృతిలోనికి లాగుకొని పోతున్నాయి. దానిని నిరోధించగలిగితే లోపలకు వెళతావు దానిని నిరోధించలేకపోతే బాహ్యానికి వెళ్ళిపోతావు, జననమరణ ప్రవాహంలో కొట్టుకొని పోతావు. వాసనను నిరోధించటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. సాధన చేసేవారు బహుజాగ్రత్తగా ఉండాలి, ప్రతీ విషయంలోను మెలుకువగా ఉండాలి. కొంతమంది ఇది సాధించాము, అది సాధించాము అంటారు, అది కూడా సాధనకు అడ్డు, దాని వలన అహంభావన పెరుగుతుంది, వాడికి మోక్షానుభవం కలుగదు, ఎందుచేతనంటే వాడు కానిదానితో తాదాప్యం పొందుతున్నాడు, అసలువస్తువును మిస్ అయిపోతున్నాడు. సాధారణంగా మానవుడికి ఉండే బలహీనతలు ఏమిటంటే తన్నుతాను పొగడుకోవటం, ఇతరులను విమర్శించటం. ఈ రెండింటి వలన మనస్వరూపానికి దూరమైపోతాము. సర్వసమర్థుడు ఉన్నాడు అనుకోండి, నేను సర్వసమర్థుడను అని వాడు మనస్సులో అనుకోడు అనుకోండి వాడికి ఈశ్వరుని దయ వస్తుంది. యిముడ్చుకొనే శక్తి లేకపోతే మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మనకు సమర్థత లేకపోయినా సమర్థత ఉందని అనుకొంటాము. మనకు అర్హత లేకపోయినా అర్హత ఉందని అనుకొంటాము.

నాకు దివ్యత్వం అనుభవంలోనికి వస్తే పాపాలనుండి, తాపాలనుండి విడుదల పొందుతాను అంటున్నారు. దివ్యత్వం పొందటం ఎలాగ అని అడుగుతున్నారు. అభ్యాసం వలన అన్నారు భగవాన్. అభ్యాసం చేయటం వలన మనస్సు కండిషన్‌లో పడుతుంది. సబ్జక్టును బాగా అర్థం చేసుకొని తరువాత దానిని ప్రాక్టీసు చేయాలి. ప్రాక్టీసు వలన మనస్సు వెళ్ళి గూటిలో పడుతుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మనస్సును నియమించుకోవటానికి అభ్యాసం చెయ్యి. నీ కళ్ళతో నీవు చూసుకో. ఇతరుల కళ్ళతో నిన్ను చూసుకోవద్దు. నీ బలహీనతలు ఏమిటో చూసుకో. అభ్యాసం చేయమంటున్నారు, అభ్యాసం ఎలా చేయమంటారు అని ప్రశ్న. జపధ్యానములు చేసుకోవచ్చు. నీ ఇష్టదేవతను రిపీటెడ్‌గా స్మరించుకోవచ్చు. అయితే ఆ దేవత మీద మీకు గౌరవం ఉండాలి, ప్రేమ ఉండాలి. ఉన్నది ఒక్కటే. జీవలక్షణాలు పోతే నరుడు నారాయణుడే. నీవు జపం చేస్తూఉంటే

మనస్సు అక్కడ ఉండాలి. నోరు జపం చేస్తూఉంటే, మనస్సు బజారులో ఉంటే మనస్సు ఎలా బాగుపడుతుంది. నువ్వు జపం ఎందుకు చేస్తున్నావు మనస్సు బాగుపడటం కోసం జపం చేస్తున్నావు కదా మరి మనస్సును బజారులో వదిలేసి నోరు ఓం నమశ్శివాయ అంటే ఎలా కుదురుతుంది. ఏ వస్తువునైతే పొందాలనుకొంటున్నావో ఆ వస్తువు మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచాలి. మనం ఆత్మను ధ్యానం చేయటంలేదు, కోరికలను ధ్యానం చేస్తున్నాము, పరిస్థితులు అనుకూలం అవ్వాలని ధ్యానం చేస్తున్నాము. ధ్యానం చేసేటప్పుడు అసలు నీ గమ్యం ఏమిటి? లక్ష్యం ఏమిటి? దివ్యత్వం పొందటానికే ధ్యానం చేస్తున్నామా? నీ గురి సరిగ్గా ఉందా అనేది చూసుకోవాలి లేకపోతే నీవు చేస్తున్న సాధన సక్సెస్ అవ్వదు. నీవు దేనినైతే పొందాలో ఆ గమ్యం విడిచిపెట్టి ఏవో చిల్లరకోరికలను ధ్యానం చేస్తే అవి నెరవేరవచ్చు గాని కాలప్రవాహంలో అవి అన్నీ కొట్టుకొని పోతాయి. జపం ధ్యానం అవసరమే. వాటివలన మనస్సు నియమింపబడుతుంది, మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. జపం, ధ్యానం కూడా కల్పితం అంటారు భగవాన్. ఈ జపం చేసే నేను ఒకటి ఉందికదా, ధ్యానం చేసే నేను ఒకటి ఉంది కదా, ఈ నేను ఎవరు అనే ప్రశ్న నీకు రావటం లేదు. జపాన్ని, ధ్యానాన్ని, దేహాన్ని, కష్టసుఖాలను, ఈ లోకాన్ని అన్నీ అదే కల్పిస్తోంది. అది ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు నువ్వు మిగులుతావు. భగవంతుడు చెప్పినమాటలు మీకు తియ్యగా లేవు అనుకోండి మీకు పూర్వపుణ్యం లేదుఅని అర్థం. స్వార్థంలేకుండా పనిచేస్తే అదికూడా నిన్ను హృదయంలోనికి తీసుకొని వెలుతుంది. కర్మఫలకాంక్ష వద్దు అని భగవంతుడు చెప్పాడు గాని కర్మఫలం రాదని చెప్పలేదు. కర్మఫలం ఆశించకుండా పని చేసినా ఫలితం వస్తుంది. ఆశించకుండా వచ్చినది నీ మనస్సును పాడుచెయ్యదు. నీవు మంచి పని చేసావనుకో, అది నువ్వు చేయగలవా? భగవంతుడే ఆ పనిని నీ చేత చేయించాడు. అది నీకు తెలియక నేను చేసాను అంటున్నావు. నువ్వు ఒకడివి ఉన్నావా అంటున్నారు భగవాన్. మన వల్ల ఏమీ అవ్వదు, గడ్డిపరక కూడా కదలదు. అంతా భగవంతుడే. అందువలన భగవంతుడి మీద భారం వేసి భగవంతుడు నీకు ఇచ్చిన పనిని శ్రద్ధగా, సహనంగా చెయ్యి. వెంకటేశ్వరస్వామికి జీవకోటి మీద ఎంత ప్రేమ ఉంది అంటే జీవకోటిలో ఉన్న దోషం కూడ ఆయనకు గుణంగా కనిపిస్తుందట అంతటి దయాస్వరూపుడు ఆయన అని అన్నమయ్య చెప్పాడు. మనకు ఎదుటివారిలో ఉన్న గుణం కూడా దోషం క్రిందకనబడుతుంది, నిరంతరం నీ ఇష్టదేవతను చింతించటం వలన వాసనకు వెళ్లే ఆహారం తగ్గిపోతుంది. వాసన నిశ్శేషంగా నశించాలి. విషయ చింతనకంటే విషమే మేలు అని చెప్పారు. విషం ఆశరీరాన్నే చంపుతుంది కాని విషయచింతన అనేక నీచజన్మలను తీసుకొని వస్తుంది. నీవు మనస్సుతోటి, దేహంతోటి తాదాత్మ్యం పొందవద్దు.

అవి నీవు కాదు. వాటితో తాదాప్యం పొందినా అవి నీవు అవ్వవు, ఏదో రోజున నీవు వాటితో విడిపోవలసిందే. గాఢనిద్రలో నీవు ఇష్టదేవతతో విడిపోతున్నావు. ఇష్టదేవతను జపించే మనస్సుతో విడిపోతున్నావు. దేహంతోటి, లోకంతోటి విడిపోతున్నావు. రాగద్వేషాలు తీసేసి చూస్తే లోకంలో ఏదీ లేదు. మనకు ఉన్న కోరికల వలననే లోకంలో ఏదో ఉందని మనకు అనిపిస్తుంది. కోరికను తీసేస్తే లోకంలో ఏమీ లేదు, అంతా శూన్యమే. దేహం ప్రారబ్ధమును బట్టి ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటుంది. అది ఈశ్వరాజ్ఞ, ఈశ్వర సంకల్పం బలీయమైనది దేహం ప్రారబ్ధమును బట్టి ఎక్కడో ఒకచోట ఉంటుంది. ఆ గోల నీకు ఎందుకు. దేహం ప్రకృతిలో తిరుగుతున్నప్పటికీ నీ మనస్సు హృదయంలో ఉన్న భగవంతుడితో తాదాప్యం పొందేలా అభ్యాసం చెయ్యి. లోపలఉన్న ప్రభువుతో అనుబంధం పెట్టుకో. హృదయకేంద్రంలో మనస్సును నిలబెట్టు. దేహం ప్రకృతిలో తిరిగి చనిపోతుంది. కాని మనస్సును భగవంతుని మీద నిలబెట్టి ఉంచండి. అదే అభ్యాసం. మనకు గమ్యం ముఖ్యం గాని స్నేహాలు ముఖ్యం కాదు. మనకు దృఢమైన సంకల్పం ఉండాలి. నీవు ఈ జన్మలో చేసిన సాధన ఏమీ వృథా కాదు, రాబోయే జన్మలో కలిసివస్తుంది. ఏకవస్తువును చింతించటం వలన మనోబలం వస్తుంది, భావనాబలం వస్తుంది. జిజ్ఞాసువుకు లోకంలోని పొగడ్తల గొడవ, విమర్శల గొడవ అక్కరలేదు. పొగడ్తల దగ్గర, విమర్శల దగ్గర ఆగిపోతే నీవు గమ్యానికి వెళ్ళలేవు. బాగుపడాలనే కాంక్ష నీకు లోపల నుండి వచ్చినప్పుడు ఆప్రవాహాన్ని ఎవరూ ఆపుచేయలేరు. ఆ జిజ్ఞాస ఎలా వస్తుంది అని అడిగితే సత్పురుషుల సహవాసం వలన నీకు జిజ్ఞాస కలుగుతుంది. కొంతమంది ఆత్మజ్ఞానం కంటే సత్పురుషుల సహవాసానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. శ్రీకృష్ణచైతన్య దగ్గర ఒక మహమ్మదీయ భక్తుడు ఉండేవాడు. శ్రీకృష్ణచైతన్య నీకు ఏమి కావాలి అని అతనిని అడిగితే నాకు ఏమీ అక్కరలేదు నీవు లేని ఈ లోకాన్ని నేనుచూడలేను, అందువలన నీ శరీరం ఉండగానే నా శరీరం పోవాలి నేను కోరుకొనేది అదే అంతకంటే నాకు ఏమీ కోరికలు లేవు అని చెప్పాడు. స్వామి ప్రహ్లాదుడితో నీ తండ్రి ఎన్ని బాధలు పెట్టినా సహించావు, ఎక్కడా మనస్సులో కూడా విరోధం పెట్టుకోలేదు, నీకు ఏమి కావాలో కోరుకో ఇస్తాను అంటాడు. అప్పుడు ప్రహ్లాదుడు స్వామిని ప్రార్థిస్తూ నిన్ను ఏ కోరికలు కోరుకోకుండా ఉండే స్థితిని నాకు ప్రసాదించు అంటాడు. అది ప్రహ్లాదుడి యొక్క వైభవం. ప్రహ్లాదుడు ఎన్ని కష్టాలు పడినప్పటికి ఎక్కడా ఆయనలో ప్రతిస్పందన లేదు ఎందుచేతనంటే అక్కడ పాపంలేదు. ఈ కలియుగంలో ఎంతసేపు భజనలు చేయాలని, గుడులు కట్టాలని అనుకొంటారు కాని జ్ఞానం సంపాదించాలనే తలంపు ఎవరికీ రావటంలేదు జ్ఞానం వైపుకు మొఖం తిరగటంలేదు, కొద్దిసేపు విచారణ చేయమంటే ఎవరూ చేయుటంలేదు. భజనలు మంచిదే, గుడులు కట్టటం మంచిదే. ఇవి అన్నీ ఎందుకు

చేస్తున్నారు, ఆ గమ్యాన్ని మీరు మర్చిపోతున్నారు. ధృడమైన మనస్సు రావాలంటే ఏమిచేయాలి అని అడుగుతున్నారు. సజ్జనసాంగత్యం వలన నీకు బాగుపడాలనే బుద్ధి కలుగుతుంది. నీవు బాగుపడు అని వారు నోటితో చెప్పరు, వారి సహవాసం వలన బాగుపడాలనే బుద్ధి లోపల నుండి మనకు కలుగుతుంది, అట్టిది సత్పురుషుల సహవాసం దాని వలన మనకు మనోబలం కలుగుతుంది. నాకు తాపాలు ఉన్నాయి, కొంతమందికి అసలు తాపాలే కనబడటంలేదు, ఎప్పుడు చూసినా ఆనందంగానే కనబడుతున్నారు అని అడిగితే వారు సిద్ధులు, శుద్ధులు. వారిని గూర్చి ప్రశ్నలు నీకు ఎందుకు? నీవు బాగుపడే విధానం నీవు చూసుకో. వారు తాపరహితస్థితిని పొందారు, వారికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. నువ్వు తాపాల్లో ఉన్నావు కదా వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. మనస్సు చెంచలం, దానిని నిగ్రహించటం చాలా కష్టం, ఇందులో సందేహం లేదు. మనస్సును నిగ్రహించటానికి కొంత సాధన చెయ్యాలి. ఎంతో కొంత వైరాగ్యం లేకపోతే మనస్సు అదుపులోనికి రాదు. అభ్యాసం వలన, వైరాగ్యం వలన దానిని స్వాధీనంలోనికి తెచ్చుకోవచ్చు. దానికి ఈశ్వరానుగ్రహం అవసరం. మనస్సు ఎప్పుడైతే విషయాలలోనికి వెళ్లిపోయిందో దాని పిలకపట్టుకొని వెనుకకు తీసుకొని వచ్చి దైవచింతనలో పెట్టాలి. దైవచింతనపోయి విషయచింతనలోనికి వచ్చేసింది అని మనకు లోపల తెలుస్తుంది అప్పుడు దానిని విషయచింతనలో నుండి వెనక్కి తీసుకొని రావాలి. మనస్సు దాని అలవాటు అది పోగొట్టుకోనప్పుడు, మీ అభ్యాసం మీరు పోగొట్టుకోవద్దు అంటున్నారు భగవాన్.

అది మంచి చేస్తుంది అని పూర్వజన్మలో నుండిఒక వాసనను తెచ్చుకొన్నాము. అది మంచిది కాదు అని ఈ జన్మలో మనకు తెలుస్తుంది. అప్పుడు ఎంత ఇష్టంగా దానిని తెచ్చుకొన్నామో ఇప్పడు దానిని తొలగించుకోవటానికి అంతఇష్టంగా, బలంగా మనం ప్రయత్నం చేస్తే గాని అది బయటకు వెళ్లదు. మనం సహనంతో, ఓర్పుతో ప్రయత్నం చేస్తూ ఉంటే గురువు అనుగ్రహం వస్తుంది. వాసన పూర్తిగా వేరుతో సహా నశించాలి, పూర్తిగా వాసన నాశనం అవ్వకుండా మీకు ఎప్పడైనా జ్ఞానం కలిగినా అది స్థిరపడదు. మనం గుడికి వెళ్లినప్పుడు అరటితొక్క కనబడితే దానిని తీసి ఒక ప్రక్కన మూలగా పడవేస్తే అది చిన్నపనే అయినా గుడిలోనికి వచ్చేవారికి ఇబ్బంది లేకుండా ఆపని చేస్తున్నాము కాబట్టి దానికి భగవంతుడు సంతోషించి మనపట్ల దయచూపిస్తాడు. మనకు అసాధ్యం ఉంది గాని భగవంతుడికి అసాధ్యం లేదు. ఆయన అనుగ్రహానికి పాత్రులయితే ఆయన స్వరూపాన్ని పొందుతాము, అదే మోక్షం.

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-10-2002, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం ఏదైనా సాధించాలంటే ముందు మన మీద మనకు విశ్వాసం ఉండాలి. రోడ్డు ప్రక్కన నిలబెట్టినటువంటి రాళ్ళమీద ఉన్న విశ్వాసం మానవుడికి తన మీద లేదు. మన మీద మనకు విశ్వాసం పెరగటానికి, మన వివేకం పెరగటానికి, ఆధ్యాత్మిక పరిణితికి ఈ సత్సంగ సమావేశాలు ఉపయోగపడతాయి. మతం పేరుమీద, నమ్మకాల పేరు మీద మనకు వివేకం, ఆలోచనశక్తి తగ్గకూడదు. మూఢనమ్మకాల కంటే మనకు వివేకం ముఖ్యం, బుద్ధిబలం ముఖ్యం. మనకు భగవంతుడు ఇచ్చిన వివేకాన్ని, బుద్దిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. భగవంతుడుమనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోవాలి కాని వాటిని దుర్వినియోగం చేయకూడదు. కొంతమంది కర్మ చేస్తారు, ఫలితం కోసం ఎదురుచూస్తూ ఉంటారు అంటే కర్మఫలం మీద ఎక్కువ ఆసక్తి ఉంటుంది, వారికి విషయచింతన పెరుగుతుంది, దైవచింతన పెరగదు. 1. విషయచింతన, 2. దైవచింతన ప్రతీవాడికి లోపల ఈఘర్షణ జరుగుతూ ఉంటుంది. సత్పురుషులతో సహవాసం ఎందుకంటే, ఉపాసన, అధ్యయనం ఎందుకంటే, జపయజ్ఞం ఎందుకంటే వీటివలన విషయచింతన బలం తగ్గుతూ ఉండాలి, దైవచింతన బలం పెరుగుతూ ఉండాలి. బాహ్యానికి విజృంభిస్తున్న మనస్సును లోపలకు మళ్ళించటం నేర్చుకోవాలి, అదే సాధన, మనస్సు బయటకు వెళితే బంధం, లోపలకు వెళితే మోక్షం.

ఒక ప్లీడర్‌గారు భగవాన్‌తో ఇక్కడకువచ్చి మీదర్శనం చేసుకొంటున్నాము, వెడుతున్నాము కాని మీదయ మా మీద ఉన్నట్లు కనబడటం లేదు. నాకు ఈ మధ్య సుఖాలు కంటే కష్టాలు ఎక్కువ వస్తున్నాయి అని అడుగుతున్నారు. ఓ బుద్ధి తక్కువవాడా, అత్యంత ఆసక్తి కలవాడా నీవు ప్రతీ చిన్న విషయానికి ఆసక్తి పెట్టుకొంటున్నావు, నా దయ నీ మీద లేదు అంటున్నావు. నీకు వచ్చిన కష్టం ఈశ్వరునికి తెలియకుండా వచ్చిందనుకుంటున్నావా? మనకు ఏది మంచిదో మన కంటే మన కంట్రోలర్‌కు తెలుసు, నిన్ను ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో నీ గురువుకు తెలుసు. నీ కొచ్చే కష్టాలు ఇబ్బందులు నా దయవలననే వస్తున్నాయి అన్న సంగతి నీకు తెలియటంలేదు. నీ చైతన్యస్థాయి పెంచటంకోసం, నీ హృదయం విశాలం అవ్వటంకోసం, నీ మనస్సులో ఉన్న వంకరలు తియ్యటంకోసం, నీ మనస్సుకు ట్రైనింగ్ ఇచ్చి దానిని హృదయాభిముఖంగా పంపటంకోసం ఈ కష్టాలు వస్తున్నాయి. నా

దయవలననే ఈ కష్టాలు వస్తున్నాయన్న సంగతి నీకు బుద్ధి తక్కువ వలన గుర్తించలేకపోతున్నావు అన్నారు భగవాన్. ప్రతీ మానవుడికి ప్రారబ్ధం ఉంటుంది, ప్రారబ్ధం లేకుండా దేహం రాదు. ఈశ్వరుడు అంతర్యామిగా ఉండి జీవులను ప్రారబ్ధంననుసరించి నడిపిస్తున్నాడు. భగవంతుడు చెప్పిన మాటలను మన గుండెలో వ్రాసుకోవటం లేదు. కాగితంమీద మాటలు ఎలా వ్రాసుకొంటున్నామో అలాగ మన హృదయంలో వ్రాసుకొంటే మన మెదడుకు తొందరగా జ్ఞాపకం వస్తాయి. పుస్తకంలో ఉన్న మాటలు బాంక్‌లో ఉన్న డబ్బు వంటివి, మన హృదయంలో నిలబెట్టుకొన్నమాటలు జేబులో ఉన్న డబ్బు వంటివి. ఈశ్వరుడు చెప్పిన మాటలు మన స్మృతిలో ఉండాలి. వాటిని ప్రమాణంగా పెట్టుకొని మనం జీవించాలి. ఆధ్యాత్మిక ప్రసంగాల వలన వచ్చే లాభాలు మీరు గుర్తించటం లేదు. వేసవి కాలంలో ఎ.సి గదిలో కూర్చొంటే మీ శరీరం ఎలాగ ఉంటుందో, మీకు ఎంత హాయిగా ఉంటుందో మీరు ఆత్మకు సంబంధించిన మాటలు వినటం వలన, వాటిని మననం చేయటం వలన మీ ప్రారబ్ధం తీసుకొని వచ్చే ఎన్నిగాయాలైనా, ఎన్నిఇబ్బందులైనా ఏమీ బాధలేకుండా ఎర్రచీమ కుట్టినంత బాధ అయినా లేకుండా మీరు భరించగలరు, ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం అది. అజ్ఞానబంధంలో నుండి విడుదల పొందటమే మోక్షం. మోక్షం లేకుండా నీకు స్వేచ్ఛలేదు, శాంతి లేదు, సుఖం లేదు. అందుచేత మోక్షాన్ని గమ్యంగా పెట్టుకొని మనం జీవించాలి. రజోగుణం తమోగుణం ఉన్నవారు కూడా మనకు గురువులే. వారితో సహవాసం వలన అది రజోగుణం అని, తమోగుణం అని మనకు తెలుస్తుంది. అప్పుడు అలా ఉండకూడదు, మనం సత్వగుణం నేర్చుకోవాలి అని మనకు అనిపిస్తుంది. సత్వగుణం ప్రాక్టీసు చేయగా చేయగా మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది, అంతర్దృష్టి లేకుండా ఆత్మజ్ఞానం రాదు. మనం ట్రైనింగ్ పొందటానికి ఈ లోకంలోనికి వచ్చాము అది మర్చిపోకూడదు. సినిమా తెరమీద బొమ్మలు కనబడతాయి కాని డైరెక్టర్ కనబడడు. అలాగే మన హృదయంలో డైరెక్టర్ ఉన్నాడు వాడే ఈశ్వరుడు. ఆయన ఎలా ఆడిస్తే ఈ దేహం అలా ఆడుతుంది. నేను స్వతంత్రుడను కాను, నాకు మోక్షం వచ్చినప్పుడు స్వతంత్రుడను అవుతాను అనే స్పృహ మనకు లేదు.

మనం మాటను, ఇంద్రియాలను, మనస్సును జాగ్రత్తగా నియమించుకోవాలి. నేను మీకు ఎలా బోధిస్తున్నానో అలాగ నా మనస్సుకు నేను బోధించుకొంటూ ఉండాలి. మీ పిల్లలను కూర్చోబెట్టి ఆధ్యాత్మికంగా, భౌతికంగా నీవు అభివృద్ధిలోనికి రావాలి., నీ పద్ధతి ఇలా ఉండాలి అని ఎలా బోధిస్తారో అలాగ మీ మనస్సుకు కూడా మీరు బోధించుకొంటూ

ఉంటే మీరు అభివృద్ధిలోనికి వస్తారు. భగవంతుడు చెప్పిన బోధ అంతా మన శరీరానికి కాదు, మనలోపల ఉన్న జీవుడికి చెప్పాడు, జీవుడు ఏరకంగా జీవిస్తే ఆయనలో ఐక్యమవుతాడో చెప్పాడు. బద్ధకస్తుడికి, సోమరితనం ఉన్నవాడికి ఏదీరాదు. మనం సహనాన్ని ప్రాక్టీసు చేయాలి, సత్యాన్ని ప్రాక్టీసు చేయాలి. నేను ఏమి ప్రాక్టీసు చేస్తున్నాను అని నాకు నేను లోపల ఉన్న జీవుడితో మాట్లాడుకోవాలి. భక్తి పేరు మీద మన తెలివిని, వివేకాన్ని, ఆలోచనను పోగొట్టుకోకూడదు. మన మీద మనకు ఎంతోకొంత నమ్మకం ఉండాలి, నమ్మకం లేకపోతే ఏ పని సాధించలేము. సత్పురుషుల మాటలు వినటం వలన అంతా లాభమే. సత్పురుషుల సహవాసం వలన లోచూపు కలుగుతుంది, మనస్సులో ఉన్న చేదు తగ్గుతూ ఉంటుంది. సత్పురుషుల సహవాసం ఆధ్యాత్మిక ఉన్నతిని సత్వరం సమకూరుస్తుంది. మహాత్ముల సాంగత్యం వలన వారి అనుగ్రహం కూడా నీకు కలుగుతుంది. పంజరంలో ఉన్న పక్షి రెక్కలు అటుఇటు కొట్టుకొన్నా పంజరంలోనే ఉంటుంది, ఎక్కడికి వెళ్ళలేదు. ఈశ్వరానుగ్రహం లేకపోతే నీవు చేసే ప్రయత్నం అలాగే ఉంటుంది. వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కోరికలు మన బుర్రలోనికి రాకుండా ఏకాగ్రత కోసం మనం పూజ, జపం, ధ్యానం కల్పించుకొన్నాము. గురుకృప కల్పించుకొన్నది కాదు, అది నాచురల్. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే మీ దేహం యొక్క ప్రారబ్దం ఎంత జుగుప్సాకరంగా ఉన్నా అతి తేలికగా తీసుకోగలరు.

హృదయస్థలంలో మనస్సును నిలబెట్టి ఉంచు. అదే భక్తి, అదే యోగం, అదే జ్ఞానం అన్నీ అదే. హృదయస్థలంలో మనస్సును నిలబెట్టి ఉంచితే మనస్సు నశిస్తుంది. మనకు ఏదోవాసన ఉంటుంది. ఆ వాసనకు అనుగుణంగా పనిచేస్తాము. అలా చేయటం వలన వాసన పెరుగుతుంది. ఇది విషచక్రం. వాసన బట్టి చేసే పని ఆపుచెయ్యి, అప్పుడు వాసన బలహీనపడుతుంది. నీకు ఏమైనా చెడుతలంపులు వచ్చినా వాటిని వెంటనే యాక్షన్‌లో పెట్టకు, పెట్టకపోతే చెడుతలంపులు యొక్క వేగం తగ్గిపోతుంది. మహాత్ములు చెప్పిన మాటలను శ్రద్ధగా వినండి, మననం చేయండి. మననం చేస్తే అవి మీ సొంతం అవుతాయి. మీ సొంతం అయితే గాని వాటి తాలుక సుఖం మీకు తెలియదు. భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు, దానిని జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మన అహంకారానికి అనుకూలంగా ఉంటే వారు స్నేహితులు అనుకొంటున్నాము, అహంకారానికి వ్యతిరేకంగా ఉంటే వారు విరోధులు అనుకొంటున్నాము. ఇలా కాలక్షేపం చేస్తూ స్మశానానికి వెళ్ళిపోతున్నాము. మనం అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవిస్తున్నాము. ఇంక ఎప్పుడు

లోపలకు వెడతాము, ఆత్మసామ్రాజ్యానికి ఎప్పుడు అధిపతులు అవుతాము. సముద్రంలో ఎంత నీరు ఉందో అంతసుఖం మన హృదయంలో ఉంది. సముద్రంలో ఎటు చూసినా నీరే గాని నోటిలో పోసుకోవటానికి ఉప్పదనం అడ్డువస్తుంది. మన హృదయంలో శాంతి సముద్రం ఉంది. కాని ఆ సముద్రం మనకు అందకుండా ఎవరు అడ్డువస్తున్నారు? ప్రకృతి, బంధువులు, స్నేహితులు, విరోధులు ఎవరూ అడ్డురావటంలేదు. దేహమునేను అనే చండాలపు తలంపే అడ్డువస్తోంది. అహంకారంతో ఉన్నవాడు కాసు, కీర్తి వీటి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. శరీరం ఉండగానే అహంకారరహిత స్థితిని పొందితే అప్పుడు కాసు, కీర్తి నీ చుట్టూ తిరుగుతాయి. ప్రొద్దుట రావిచెట్టు చుట్టూ తిరిగి మధ్యాహ్నం ఫలంకోసం చూడకండి. అలా చూస్తూ ఉంటే అది బుద్ధి తక్కువ వారు చేసేపని, దీనిని వేదాంత పరిభాషలో ఆసక్తిదోషం అంటారు. నువ్వు ఆసక్తిరహితుడవు అయితే గాని నీకు ఆత్మగోచరించదు. చెట్టును చంపనక్కరలేదు, నీరు పొయ్యకపోతే అదే చనిపోతుంది. అలాగే దేహము నేను అనే తలంపుకు ఫుడ్ సప్లయి మానెయ్యి. దానంతట అదే కృసించి నశిస్తుంది. సుఖం శాంతి నీ హృదయంలోనే ఉన్నాయి. కాని దానిపైన అహంకారం అనే మూత ఉంది. అది నీకు బంగారంలాగ కనిపిస్తోంది అందుచేత దానిని తొలగించుకోలేకపోతున్నావు. ఆ మూత తొలగిస్తే కాని నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అనుభవంలోనికి రాదు.

ఒక మనిషికి ప్రాణం పోయింది అనుకోండి. వారిని మీరు పొగిడినా, మీరు విమర్శించినా ఆ శవం ఏమీ మాట్లాడదు. మీ పొగడ్తల ప్రభావం గాని, విమర్శల ప్రభావం గాని ఆ శవం మీద ఉండదు. నీవు శరీరం ఉండగా, మనస్సు పనిచేస్తూ ఉండగా, ముక్కులో గాలి తిరుగుతూ ఉండగా ఆ శవం నిందకు, స్తుతికి ఎలా అతీతంగా ఉందో అలాగ నువ్వు ఉండగలిగితే నీకు మోక్షం పొందటానికి అర్హత వస్తుంది, మోక్షం జానెడు దూరంలో ఉంది అన్నారు ఆచార్యులవారు. మనం దేహంతో తాదాప్యం పొందటం ఎంత పొరపాటో, మనస్సుతో తాదాప్యం పొందటం కూడా అంతే పొరపాటు. జ్ఞానం పొందటానికి దేహంతో తాదాప్యం ఎలా అడ్డువస్తుందో, మనస్సుతో తాదాప్యం కూడా అలాగే అడ్డు వస్తుంది. మీకు ఉపయోగం లేని తలంపులు వస్తూఉంటే మొదట్లోనే త్రుంచేయండి. గాలిమేడలు కట్టవద్దు. మీ కాళ్ళు భూమి మీదే ఉంచి, ఆలోచించండి. మనకు అజ్ఞానం ఉంది అనుకోండి నేను జ్ఞానిని అయిపోయాను అనుకోవద్దు. అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఉన్నదానికి లేకపోవటం

అంటూ లేదు, ఇది నిశ్చయం. అహంభావరహితంగా జీవించేవాడికి మాత్రమే ఇది తెలియబడుతుంది. 99 మంచిగుణాలు ఉండి, ఒక చిన్నదోషం ఉంది అనుకోండి, కొంతమంది ఆ చిన్న దోషాన్ని చూస్తారు. మన బుద్ధిలో నమ్రత లేనప్పుడు, ఏకాగ్రత లేనప్పుడు ఇలాంటి దోషాలు చూస్తాము. నీ హృదయంలో ఉన్న నిజాన్ని నీ బుద్ధి గ్రహించేవరకు నిజంకానిదానిని నిజంఅని అనుకోవటం మానదు, ఇది పాడుబుద్ధి, శవబుద్ధి. భగవంతుని అర్చన చేయగా చేయగా, భగవంతుని మాటయందు మనం గౌరవం పెంచుకొంటూ ఉంటే, భగవంతుని పాదాలను విడిచిపెట్టకుండాఉంటే ఈ పాడుబుద్ధినితొలగించి ఎటువంటిబుద్ధిని ఇస్తే మన హృదయంలో ఉన్న నిజం తెలుస్తుందో అటువంటి బుద్ధిని భగవంతుడు ప్రసాదిస్తాడు. మనం సాధన చేసి నేర్చుకోవలసింది ఏమిటి అంటే భగవంతుని సంకల్పాన్ని మన సంకల్పంచేసుకోవాలి. ఆయన సంకల్పాన్ని మనం సొంతం చేసుకొంటే ఇంక మనం ఉండము, ఉండేది ఆయనే. నీలోపల ఉన్నసత్యం తప్పించి ఈ సృష్టిలో సారవంతమైనది ఏదీ లేదు. మనం కల్పించుకొన్న విషయాలు వదిలివేయటమే మన సాధన లక్ష్యం. ఎప్పుడైనా మీ దేహం అనారోగ్యంగా ఉంటే సాధన విడిచిపెట్టవద్దు. దేహానికి ఏదో ఒకటి వస్తూ ఉంటుంది. సమాజంలో ఏదో సమస్యలు ఉంటాయి. మనస్సు ఏవో ఒంపులు పెడుతుంది. ఆ ఒంపులు పట్టుకొని సత్యాన్వేషణ విడిచిపెట్టవద్దు. మనకు లోపల ధృడమైనసంకల్పం ఉండాలి. నీకు ఆత్మజ్ఞానం సంపాదించాలి అనే పట్టుదల ఉంది అనుకో, ఆ ధృడత్వం ఉంది అనుకో అప్పుడు నీకు వచ్చే కష్టం కష్టంలాగ కనబడదు. మనకు శ్రద్ధ ఉంటే అసలు ఎక్కడోచోట మార్గం కనిపిస్తుంది. జ్ఞానం అనేది లోపల నుండి ఊరాలి గాని పైనుండి పోసేది కాదు. జ్ఞానం పొందాలి అనే కాంక్షలోపలనుండి ఉబికిరావాలి. ఆ కాంక్ష రావటానికే సత్పురుషుల సహవాసం. సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష నీకు ఉంటే, ఆ ధృడసంకల్పం నీకు ఉంటే మీ ఇంటిదగ్గర ఏమైనా ఇబ్బందులు వచ్చినా, సమాజంలో నుండి, ప్రకృతిలో నుండి, ఏమైనా ఇబ్బందులు వచ్చినా అవి ఇబ్బందుల క్రింద నీకు కనబడవు. సత్యాన్వేషణ లేనప్పుడు మనం ప్రతీ చిన్న విషయానికి కష్టం వచ్చేసింది అనుకొంటాము.

## శ్రీ రమణ క్షేత్రం ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | వినీలాకాశంలో వింతకాంతి | 25/- |
| 2 | అమృత వాక్కులు | 20/- |
| 3. | The Call of the Holy Hill | 20/- |
| 4. | మధుర వాక్యములు | 10/- |
| 5. | శ్రీ రమణ ప్రస్థానత్రయం | 12/- |
| 6. | శ్రీ రమణ మహిమలు | 5/- |
| 7. | దైవ సంపద | 12/- |
| 8. | జ్ఞాన కిరణాలు | 6/- |
| 9. | సద్గురు శ్రీ నాన్నగారు | 3/- |
| 10. | శ్రీ రమణ ప్రసాదం | 5/- |
| 11. | అక్షరమణమాల | 10/- |
| 12. | శ్రీ నాన్న ప్రవచనాలు | 20/- |
| 13. | వాశిష్ట రమణీయం | 5/- |
| 14. | సత్యాన్వేషణ-సత్యదర్శనం | 10/- |
| 15. | శ్రీ రమణ అనుగ్రహతరంగాలు | 60/- |

## శ్రీ రమణ క్షేత్రంలో లభించు శ్రీరమణాశ్రమ ప్రచురణలు

| నెం. | పుస్తకం పేరు | వెల |
|---|---|---|
| 1. | శ్రీ రమణ భాషణములు | 80/- |
| 2. | శ్రీ రమణ లేఖలు | 80/- |
| 3. | శ్రీ రమణ దివ్య జీవితమకరందం | 50/- |
| 4. | నీ సహజ స్థితిలో ఉండు | 50/- |
| 5. | శ్రీ మహర్షి | 20/- |
| 6. | నేను ఎవడను? | 3/- |
| 7. | శ్రీ రమణ మహర్షి బోధలు | 20/- |
| 8. | శ్రీ రమణ కథాసుధ | 15/- |
| 9. | శ్రీ రమణ వైభవం | 45/- |
| 10. | శ్రీ రమణ గ్రంథమాల | 75/- |
| 11. | ఋభుగీత సారం | 15/- |
| 12. | శ్రీ రమణ స్మరణామృతం | 70/- |

నోట్ : పోస్టల్‌ద్వారా కావలసినవారు పోస్టల్ ఖర్చులుకూడా పంపించవలెను.

## రమణ భాస్కర ప్రచురణల బైండులు

| | | |
|---|---|---|
| 1. | 1998-1999 | రు. 50/- |
| 2. | 1999-2000 | రు. 100/- |
| 3. | 2000-2001 | రు. 100/- |
| 4. | 2001-2002 | రు. 125/- |

**సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనములు ఆడియో క్యాసెట్లు మరియు ఆడియో సి.డి.లు కొరియర్ ద్వారా పంపబడును, క్యాసెట్ ధర : రు. 40/- , సి.డి. ధర : రు. 55/-లు మాత్రమే**

**చందాదారులకు విజ్ఞప్తి**

రమణభాస్కర పత్రిక అందనియెడల మీ అడ్రస్సు తెలియజేస్తూ తదుపరి సంచికలోపు రమణభాస్కర, జిన్నూరు 534 265 కు పోస్టుకార్డు ద్వారా తెలియచేయండి.



పంచారామాలలో క్షీరారామం (పాలకొల్లు) శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి, పార్వతి అమ్మవారు

**REGISTERED NEWS PAPER** RNI NO. APTEL/1999/1667-POSTAL REGN. NO. H/BMV/5/2001

To

060 P. Sandhya, Road No.2
# 151, Rao & Raju Colony, Opp: LV
Prasad Eye Hospital, Banjara
Hills, **HYDERABAD** 34

*If undelivered please return to :*
**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM
JINNURU - 534 265. W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, Palakol - 534 265. W.G. Dt. © 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, Palakol - 534 260. W.G. Dt. © 22438, 21260